● బాబు జగ్జీవన్‌రామ్ యాదిలో..



బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, బాలకిషన్, సుంకె రవిశంకర్ తదితరులు

## బాబు జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

- రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా 117వ జయంతి

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ) : మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ దేశానికి, కార్మికలోకానికి చేసిన సేవలు చిరస్మరణీయమని నాయకులు, ప్రజాసంఘాల నేతలు కొనియాడారు. దళితసంఘాలు, ప్రజాసంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు, విద్యాసంస్థల ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ అణగారినవర్గాల హక్కుల కోసం అవిశ్రాంత పోరాటం చేసిన రాజకీయ-సామాజిక యోధుడని కొనియాడారు. దేశంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిత్యం పాటుపడ్డారని, నేటి యువత ఆయన స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలోని సమతా స్థల్‌లో జగ్జీవన్‌రామ్‌కు బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు నివాళులర్పించారు.

## దళితబంధుపై విజి'లెన్స్'

మొదటిపేజీ తరువాయి...

రోజుల నుంచి ఆరా తీస్తున్నారు. తాండూరు నియోజకవర్గంలో ఇప్పటికే పలువురు లబ్ధిదారులను ఎంక్వైరీ చేసినట్టు తెలిసింది.

### బీఆర్ఎస్ హయాంలో 358 కుటుంబాలకు లబ్ధి

వికారాబాద్ జిల్లాలోని 5 నియోజకవర్గాల్లో 'దళితబంధు' అమలుకు అధికారులు తొలి విడతలో 358 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. అనంతరం వారికి నచ్చిన వ్యాపారాలు చేసుకునేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారుకు రూ.10 లక్షల చొప్పున జిల్లాకు మొత్తం రూ.35.80 కోట్లు విడుదల చేసింది. దీంతో వికారాబాద్‌లో 100, తాండూరులో 100, పరిగిలో 80, కొడంగల్‌లో 60, చేవెళ్ల నియోజకవర్గంలో 18 యూనిట్లను అధికారులు గ్రౌండింగ్ చేశారు. ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా ఈ ప్రక్రియను పూర్తి చేయడంతో లబ్ధిదారుల కుటుంబాల్లో వెలుగులు నిండాయి. అనంతరం జిల్లాలో రెండో విడత 'దళితబంధు' అమలు కోసం బీఆర్ఎస్ ప్రభుత్వమే రూ.60 కోట్లు విడుదల చేయడంతో లబ్ధిదారుల ఎంపికకు అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. ఇంతలో ఎన్నికల షెడ్యూల్ రావడంతో ఆ ప్రక్రియ మధ్యంతరంగా నిలిచిపోయింది.

### నాలుగు నెలలైనా స్పష్టత కరువు

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 'దళితబంధు' అమలుపై సందిగ్ధత కొనసాగుతూనే ఉన్నది. ఈ పథకాన్ని కొనసాగించాలని రెండో విడత లబ్ధిదారులు విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేదు. పైపెచ్చు 'దళితబంధు' కింద కొత్తగా ఎవరికీ ఆర్థిక సాయం చేయవద్దని అధికారులను ఆదేశించింది. అంతటితో ఆగకుండా జిల్లాలో రెండో విడత దళితబంధుకు గతంలో కేసీఆర్ ప్రభుత్వం విడుదల చేసిన రూ.60 కోట్లను వెనక్కి తీసుకున్నట్టు తెలుస్తున్నది. ఆ నిధులను 'దళితబంధు' లబ్ధిదారులకు మంజూరు చేస్తారా? అసలు ఈ పథకాన్ని కొనసాగిస్తారా? లేదా? అన్నదానిపై రేవంత్ ప్రభుత్వమే స్పష్టత ఇవ్వాల్సి ఉన్నది.

# పార్టీ మారితే వేటు!

మొదటిపేజీ తరువాయి...

ఆసక్తికరమైన చర్చ జరుగుతున్నది. కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి వస్తే రాజ్యాంగ సవరణకు అవకాశం ఉంటుంది. అప్పుడు ఈ హామీ నెరవేర్చితే ప్రజలు వేసిన ఓట్లకు నిజమైన న్యాయం జరుగుతుంది. వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీలు మారే వారిపై వేటు వేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించినట్టు అవుతుంది. కానీ కాంగ్రెస్ పార్టీ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవడానికి ఇప్పుడే అద్భుత మైన అవకాశం ఉన్నదని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నది. ఇక్కడ బీఆర్ఎస్ నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎంపీలు కాంగ్రెస్‌లో చేరారు. వీరిని భయపెట్టో, ప్రలోభపెట్టో పార్టీలో చేర్చుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఒరిజినల్‌గా బీఆర్ఎస్ నుంచి గెలిచి అధికార పార్టీలో చేరినవారిపై కాంగ్రెస్ వేటు వేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకొనే అద్భుతమైన అవకాశం ఉన్నదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తద్వారా దేశంలో కాంగ్రెస్ నిజాయితీని నిరూపించుకొని మిగతా రాజకీయ పార్టీలకు ఆదర్శంగా నిలువొచ్చని అభిప్రాయపడ్డారు.

### కాంగ్రెస్ గురివింద నీతి

లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి కోసం ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు నానా పాట్లు పడుతున్న కాంగ్రెస్ తన గురివింద నీతిని మరోసారి చాటుకున్నదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణలోని పరిస్థితులను చూస్తుంటే ఈ హామీ కేవలం మ్యానిఫెస్టోకే పరిమితమవడం ఖాయమన్న అభిప్రాయాలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారాన్ని వెలగబెడుతున్న కాంగ్రెస్.. ఇతర పార్టీల నుంచి గెలిచిన పలువురు ఎమ్మెల్యేలను, ఎంపీలను అడ్డగోలుగా చేర్చుకోవడంతోపాటు వారిలో కొందరిని రానున్న లోక్‌సభ ఎన్నికలకు తమ అభ్యర్థులుగా ప్రకటించింది. కేంద్రంలో అధికారంలోకి వస్తే ఫిరాయింపుదారులపై అనర్హత వేటువేస్తామని నమ్మబలుకుతున్న కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేనే స్వయంగా ఇటీవల పెద్దపల్లి బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ నేతకాని వెంకటేశ్ తన పదవికి రాజీనామా చేయకముందే ఆయన మెడలో కాంగ్రెస్ కండువా కప్పారు. 'ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా' అన్న చందంగా పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి సైతం ఖైరతాబాద్ బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తోపాటు చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. 'అంతకంటే ఘనుడు ఆచంట మల్లన్న' అన్నట్టుగా కాంగ్రెస్ అధిష్ఠానం ఏకంగా వీరిలో ఒకరిని సికింద్రాబాద్ నియోజకవర్గానికి, మరొకరిని చేవెళ్ల నియోజకవర్గానికి తమ ఎంపీ అభ్యర్థులుగా ప్రకటించింది. దీంతో ఒక పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే ఆ పార్టీకి రాజీనామా చేయకుండానే ఎంపీ అభ్యర్థిగా ఎలా ప్రకటిసాస్తారని కాంగ్రెస్ నాయకులే విస్తుపోయారు. ఇలా చేయడం వల్ల భవిష్యత్‌లో న్యాయపరమైన చిక్కులు తప్పవని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్వయంగా వ్యాఖ్యానించారు. అయినప్పటికీ పీసీసీ ఆయననే సికింద్రాబాద్ లోక్‌సభ సెగ్మెంట్‌కు కాంగ్రెస్ ఎన్నికల ఇంచార్జిగా నియమించి, దానం నాగేందర్‌ను గెలిపించే బాధ్యతను అప్పగించడం కొసమెరుపు. వరంగల్ సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బీఆర్ఎస్‌కు రాజీనామా చేయకుండానే ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరడం, వారికి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లో చేరినట్టు సీఎం రేవంత్‌రెడ్డి అధికారికంగా ప్రకటించడం మరీ విడ్డూరం. ఇలా ఒకవైపు అడ్డగోలుగా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్ పార్టీ.. మరోవైపు రాజ్యాంగాన్ని సవరిస్తామని, ఫిరాయింపుదారులపై అనర్హత వేటు వేస్తామని చెప్పడం 'దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టు'గా ఉన్నదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

13. We promise to amend the Tenth Schedule of the Constitution and make defection (leaving the original party on which the MLA or MP was elected) an automatic disqualification of the membership in the Assembly or Parliament.

● మదగజం.. తిరుగుముఖం



మహారాష్ట్రలోని నాగుల్వాయి నుంచి ప్రాణహిత నది దాటి మూడు రోజుల క్రితం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోకి వచ్చి ఇద్దరిని పొట్టపెట్టుకున్న మదగజం శుక్రవారం సాయంత్రం ఎట్టకేలకు తిరుగుముఖం పట్టింది. శుక్రవారం ఉదయం ఈ ఏనుడు బెజ్జూర్ మండలం కమ్మర్‌గాం-జిల్లెడ గ్రామాల మధ్య కొండల్లో కనిపించింది. మూడు రోజుల క్రితం ప్రవేశించిన ఈ ఏనుగు చింతలమానేపల్లి మండలం బూరెపల్లిలో అల్లూరి శంకర్(55)ను, పెంచికల్‌పేట్ మండలం కొండపల్లిలో కారు పోశన్న(65)ను బలితీసుకున్న విషయం విదితమే. సరిహద్దు మండలాల ప్రజలకు కునుకు లేకుండా చేసిన ఈ ఏనుగు ఆచూకీ కనిపెట్టేందుకు రెండు రాష్ట్రాల అధికారులకు కత్తి మీద సాములా మారింది. మహారాష్ట్రకు చెందిన బృందంతోపాటు జిల్లాలోని మూడు అటవీ శాఖ బృందాలు థర్మల్ డ్రోన్‌ల సాయంతో ఏనుగు జాడను గుర్తించాయి. గురువారం రాత్రి కొండపల్లి సమీపంలో రోడ్డుపైకి వచ్చి బస్సుకు అడ్డుపడింది. శుక్రవారం ఉదయం కమ్మర్‌గాంలోని పల్లె ప్రకృతి వనంలో స్థానికులకు ఏనుగు కనిపించింది. సాయంత్రం మొర్లిగూడ అటవీ సమీపం నుంచి ప్రాణహిత నది తీరం దాటి మహారాష్ట్ర అడవుల్లోకి వెళ్లినట్టు డ్రోన్ కెమెరా ద్వారా నిర్ధారించుకున్నట్టు ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో సుధాకర్ తెలిపారు. దీంతో అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకునా్నరు.

– కుమ్రంభీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/బెజ్జూర్/ పెంచికల్‌పేట్

## నేడు తుక్కుగూడలో కాంగ్రెస్ జన జాతర సభ

- రానున్న ఖర్గే, రాహుల్, ప్రియాంక
- ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సీఎం
- 'పాంచ్ న్యాయ్.. పచ్చీస్ గ్యారెంటీ'లను విడుదల చేయనున్న రాహుల్

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో శనివారం నిర్వహించనున్న భారీ బహిరంగసభ ద్వారా కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల శంఖారావం పూరించనున్నది. దీనికి రాజీవ్ గాంధీ ప్రాంగణంగా, జనజాతర సభగా ఆ పార్టీ నామకరణం చేసింది. పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి ఈ సభను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని జన సమీకరణ, ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల జాతీయ మ్యానిఫెస్టోను ఇదే సభా వేదికపై ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ విడుదల చేస్తారని పీపీసీ పేర్కొన్నది. ఈ సభకు 10 లక్షల మంది హాజరయ్యేలా జన సమీకరణకు ప్లాన్ చేసినట్టు తెలిపింది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి న సెంటిమెంట్‌తో పార్లమెంట్ ఎన్నికలకు కూడా ఇక్కడి నుంచే శంఖారావం పూరిస్తున్నట్టు పీసీసీ అధినేత, సీఎం రేవంత్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రం నలుమూలాల నుంచి పెద్ద ఎత్తున జన సమీకరణకు ప్లాన్ చేయడంతో పాటు 70 ఎకరాల్లో సభ ప్రాంగణం ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల కోసం ఏఐసీసీ రూపొందించిన మ్యానిఫెస్టోలో 'పాంచ్ న్యాయ్.. ప చ్చీస్ గ్యారెంటీ' పేరుతో ఐదు రకాల ప్రధాన హామీలు ఇస్తున్నట్టు పీసీసీ పేర్కొన్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వందరోజుల పాలన విజయాలతో పాటు కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టబోయే కార్యక్రమాలపై సభలో పార్టీ ప్రకటిస్తుందని పేర్కొన్నారు.

## ఎస్సీ ఉపకులాల సమస్యలు పరిష్కరించండి

- సీఎం రేవంత్‌రెడ్డికి ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి విజ్ఞప్తి

హైదరాబాద్, ఏప్రిల్5 (నమస్తే తెలంగాణ): ఎస్సీ ఉపకులాల సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సంఘం నేతలతో సీఎం రేవంత్‌రెడ్డిని శుక్రవారం ప్రత్యేకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఆర్డీవో నుంచి కాకుండా తహసీల్దార్ నుంచే కుల సర్టిఫికెట్లు అందేలా చర్యలు తీసుకోవాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆయా అంశాలపై సీఎం సానుకూలంగా స్పందించారని వెంకటేశం వెల్లడించారు.

## వెంబడించి.. పొట్టన పెట్టుకున్నారు

- ఫైనాన్స్ వాళ్ల నుంచి తప్పించుకొనే క్రమంలో చెరువులోకి దూకిన యూపీ కార్మికుడు
- ఈత రాకపోవడంతో మృతి



వినయ్ (ఫైల్)

రఘునాథపాలెం, ఏప్రిల్ 5 : ఫైనాన్స్ రికవరీ ఏజెంట్లు వెంబడించడంతో తప్పించుకొనేందుకు పరిగెత్తిన యూపీ కార్మికుడు చెరువులో దూకి మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం ఖమ్మం నగర పరిధి జయనగర్‌కాలనీకి ఆనుకొని ఉన్న ఖానాపురం చెరువు వద్ద చోటుచేసుకున్నది. ఖానాపురం హవేలీ పోలీసుల కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఆగ్రాకు చెందిన వినయ్ (21) బతుకుదెరువు కోసం ఖమ్మం వచ్చి దానవాయిగూడెంలో నివాసం ఉంటున్నాడు. మార్బుల్ పనులు నిర్వహించే వినయ్, తన మేస్త్రీ అజయ్ ఠాగూర్‌తో కలిసి ఖమ్మం నగరానికి చెందిన మోహన్‌సాయి ఫైనాన్స్‌లో ద్విచక్ర వాహనాలకు ఫైనాన్స్ తీసుకున్నారు. వినయ్ వాహనంపై రూ.4 వేలు, మేస్త్రీ అజయ్‌ఠాగూర్ వాహనంపై రూ.14 వేలు బకాయిలు ఉన్నాయి. వినయ్ వాహనాన్ని ఫైనాన్స్ రికవరీ ఏజెంట్లు రామచందర్, అజయ్ కుమార్ నాలుగురోజుల క్రితమే స్వాధీనపర్చుకున్నారు. శుక్రవారం జయనగర్ కాలనీలో పనులు నిర్వహిస్తున్న వినయ్ వద్దకు వచ్చిన రికవరీ ఏజెంట్లు డీ రాంచందర్, అజయ్‌కుమార్ మేస్త్రీ వాహన విషయమై నిలదీశారు. దీనిపై వారి మధ్య వాగ్వాదం జరగడంతో వినయ్ తప్పించుకునేందుకు పరుగుతీశాడు. రికవరీ ఏజెంట్లు బైక్‌పై వినయ్‌ని వెంబడించారు. పరిగెత్తుకుంటూ ఖానాపురం చెరువువైపుగా వచ్చిన వినయ్ తప్పించుకోవాలని అందులోకి దూకాడు. ఈత రాక వినయ్ చెరువులో మునిగి ప్రాణాలు వదిలాడు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై సంతోష్ తెలిపారు.

